క్లుప్తంగా

కె.కె.రాజుకు సత్కారం



కె.కె.రాజును సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న తాడి జగన్నాథ్‌రెడ్డి.

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడు కె.కె.రాజును ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో గురువారం పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తాడి జగన్నాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కె.కె.రాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పేపర్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు శిక్షణ



పేపర్ క్రాఫ్ట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎం.శిరీష పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి రోజూ కనీసం గంట సేపు పుస్తకాలు చదవాలని ఆమె సూచించారు. నీతి కథలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు పేపర్ కటింగ్ ద్వారా వివిధ రకాల వస్తువులు తయారు చేశారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్



సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌కు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. సత్యం సెంటర్ నుంచి పంజాబ్ డాబా వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు కొద్ది రోజులుగా ఫెన్సింగ్ వేస్తున్నారు. గతంలో వేసిన ఫెన్సింగ్ పలుచోట్ల మాయం కావడంతో గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువని సాక్షిలో ప్రచురించిన వార్తలకు జీవీఎంసీ అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టారు. గతంలో కంటే మెరుగైన రక్షణ కల్పించేలా కాంక్రీట్ దిమ్మలపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. రక్షణ చర్యలు చేపడుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



సిద్ధార్థనగర్‌లో బెడ్ పేషెంట్‌కు పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఐటీఐ జంక్షన్ సిద్ధార్థనగర్, భవానీ గార్డెన్స్, గజపతినగర్, దేవేంద్రనగర్, రవీంద్రనగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ల సొమ్ము అందజేశారు.

శంకుస్థాపన సరే.. పనులు ఎప్పుడు?







ముందుకు కదలని బృందావన్ పార్కు అభివృద్ధి పనులు

రూ.10.77 లక్షలతో మార్చిలో శ్రీకారం

నిరుత్సాహంలో స్థానికులు, చిన్నారులు

టీపీటీ కాలనీలోని బృందావన్ పార్కు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార టీపీటీ కాలనీలోని బృందావన్ పార్కు.. ఆధునికీకరణకు ఎదురు చూస్తోంది. ఈ పార్కులో అభివృద్ధి పనులకు ఏ ముహూర్తాన శంకుస్థాపన చేశారో గాని.. వాటి జాడ మాత్రం కానరావడం లేదు. జీవీఎంసీ విడుదల చేసిన రూ.10.77 లక్షలతో ఈ ఏడాది మార్చి 12న బృందావన్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం తెలిసిందే. నెలన్నర రోజులు దాటిపోయినా సరే.. ఇక్కడ పనుల పురోగతి ఏమాత్రం లేదు. అధికారులు ఈ పనులను గాలికొదిలేయడంతో జాప్యం నెలకొంది. పేరుకే బృందావన్ పార్కు.. లోపల అడుగు పెడితే అంతా చిందరవందరగా ఉంటోందని ఇటు స్థానికులు.. అటు సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవుల్లో పార్కు సిద్ధంగా లేకపోవడంతో స్థానిక చిన్నారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. పార్కు పనులు చేపట్టాల్సిన జీవీఎంసీ జోన్–3 ఇంజినీర్ల జాడే కనిపించడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. స్థానిక సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ కూడా పత్తా లేకుండా పోయారని మండిపడుతున్నారు.

నిర్వహించాల్సిన పనులివే..

బృందావన్ పార్కులో పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మన్ గదికి, బోరింగ్‌కు మరమ్మతులు, ఇతర చిన్న చిన్న రిపేర్లు పూర్తి చేయాలి. అభివృద్ధి పనుల నిమిత్తం ఇప్పటివరకు ఇక్కడ ఎటువంటి నిర్మాణ సామగ్రి సైతం అందుబాటులో లేకపోవడంపై పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే పార్కులో పలు సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టి.. త్వరితగతిన పార్కు అభివృద్ధి పనులు పూర్తిచేయాలని కాలనీ వాసులు, సందర్శకులు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

బృందావన్ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగానే ఉన్నాం. త్వరలోనే పనులు ప్రారంభించి, పార్కును స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– గంగాధర్, ఈఈ, జీవీఎంసీ జోన్–3

భూత్ బంగ్లా కాదు.. పెన్షనర్ల సంఘం



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శిథిలావస్థకు చేరిన పెన్షనర్ల సంఘ భవనం

- పూర్తిగా శిథిలమైన భవనం
- పెన్షనర్ల భయాందోళనలు

సీతమ్మధార:

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని పెన్షనర్ల సంఘ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని భూత్ బంగ్లాను తలపిస్తోంది. కూలిపోవడానికి సిద్ధంగా భవనం ఉందని పెన్షనర్లు గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో అన్నట్టుగా ఉందని పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలోని ఖజానా కార్యాలయానికి లైఫ్ సర్టిఫికెట్లు, పెన్షన్ హెచ్చుతగ్గులు, బకాయిలు వంటి పలు పనుల నిమిత్తం పెన్షనర్లు రోజూ అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖ జిల్లా పెన్షనర్లు ఇక్కడికి తరలి వస్తారు. ఎన్నో ఏళ్ల కిందటే ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెన్షనర్లు కూర్చోవడానికి నీడ కరువైంది. ఫలితంగా ఖజానా కార్యాలయానికి వచ్చే వారు గట్లు, చెట్ల కిందన వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి ఏళ్ల తరబడి కనీసం ప్యాచ్ వర్క్‌లు సైతం నిర్వహించక పోవడంతో కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో గీతా సత్సంగం కూడా కొన్నేళ్ల పాటు నిర్వహించారు. భగవద్గీత కార్యక్రమాలు జరిగేవని పెన్షనర్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భవనంలో పెద్ద పాములపుట్ట ఉందని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోకి నాగు పాము వచ్చింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని పెన్షనర్లు, స్థానికులు కోరుతున్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వివిధ అంశాల్లో ఉచితంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. పార్కులోని వైశాఖి భవనంలో గురువారం మేడే సందర్భంగా శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. 6 నుంచి 12 ఏళ్ల వయసు గల పిల్లలకు భగవద్గీత పఠనం, యోగా, చిత్రలేఖనం, పెయింటింగ్, నృత్యం, అబాకస్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు నేరుగా పార్కు కార్యాలయానికి వచ్చి పిల్లల పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పి.వి.సూర్యనారాయణరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం వీ హెల్త్ కేర్, వీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులకు వివిధ బీపీ, డయాబెటిక్ వంటి ఆరోగ్య పరీక్షలతోపాటు దంత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, ప్రస్తుతం తీసుకుంటున్న జంక్‌ఫుడ్స్ వంటి ఆహార పదార్థాల వల్ల ఆరోగ్యం పాడవుతుందని అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వీ హెల్త్ కేర్ వైద్యులు డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది కృష్ణ, కె.తులసి, ఎస్.కె.లతీష, లిఖిత్, ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి కిశోర బాలికలకు వేసవి శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం: అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ఎంవీ రమణకుమారి తెలిపారు. గురువారం అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. శిక్షణలో భాగంగా కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించాలని సూచించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కిశోర బాలికల శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ బి.మమత, కె.శకుంతల, ఐ.సులేఖ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ నియామకాల(డీఎస్సీ) ప్రకటన ద్వారా గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం నాయకులు గురువారం రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన యువతకు ప్రయోజనం చేకూర్చే జీవో నంబర్ 3ని పునరుద్ధరించకుండా, ప్రత్యామ్నాయ ఉత్తర్వులు కూడా జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని వారు తెలిపారు. దీనివల్ల అత్యంత వెనుకబడిన గిరిజన తెగల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్చించి కొత్త ఉత్తర్వులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీలో గిరిజన అభ్యర్థులకు నూరు శాతం రిజర్వేషన్‌ను తిరిగి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, కార్యదర్శి శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈదురు గాలులకు చిరిగిన హోర్డింగ్ బ్యానర్లు



గాలికి చిరిగి వేలాడుతున్న హోర్డింగ్ బ్యానర్

ఏయూక్యాంపస్: నగరంలో ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లకు ఏర్పాటు చేసిన భారీ బ్యానర్లు చిరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇవి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌కు చేరువలో ఉన్న భారీ హోర్డింగ్ బ్యానర్ చిరిగిపోయి కిందకు వేలాడుతోంది. వాహన చోదకులకు, కార్లకు ఇది తగిలేలా ఉండటంతో జీవీఎంసీ సిబ్బంది వెంటనే స్పందించారు. వేలాడుతున్న ప్లాస్టిక్ బ్యానర్లను అతికష్టం మీద తొలగించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎటువంటి ప్రమాదం జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ పక్కనే ఉన్న భారీ హోర్డింగ్‌కు సంబంధించిన బ్యానర్లు సైతం గాలికి చిరిగిపోయి వేలాడుతున్నాయి. వీటిని నిర్వాహకులు తొలగించాల్సిన అవసరం ఉంది.

కార్మికుల హక్కులు కాపాడుకుందాం



సీతమ్మధార జంక్షన్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న పదాల గోవింద్



మాధవధారలో జెండా ఆవిష్కరిస్తున్న చౌదరి అప్పారావు తదితరులు



కంచరపాలెం కూడలి నుంచి ర్యాలీగా వెళ్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

మేడే వేడుకల్లో నాయకుల పిలుపు

సీతమ్మధార: మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పదాల గోవింద్ చేతుల మీదుగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, హక్కుల పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.మధురెడ్డి, బోర రమణ, వెంకటేష్, శ్రీను, సూరిబాబు, అప్పన్న, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద దుస్తుల వ్యాపారుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథి సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి జెండా ఎగరేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్ సంస్థలకు అనుకూలంగా కార్మికులకు నష్టం కలిగించే విధానాలు అమలు చేస్తోందని దుయ్యబట్టారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రెహ్మాన్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాత్రపల్లి చంద్రశేఖర్, భీంపల్లి రాము, సుంకర నగేష్, శ్రీను, ఎస్. నాగభూషణ్, కె. లక్ష్మణరావు, శివాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి..

టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకలు మేడే నిర్వహించారు. వరుణ్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వెయ్యి మందికి చొక్కాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి, జె.వి ప్రభాకర్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని విమర్శించారు. ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రవి కృష్ణ, యు. శివాజీ, శ్రీను, శేషు నాయుడు, సలీం, బి. అప్పలరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

మద్దిపాలెం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మాధవధార జంక్షన్‌లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు మాధవధార 48వ బస్టాప్ వద్ద, స్కేటింగ్ పార్కు వద్ద ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ గౌరవ అధ్యక్షుడు కూన కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, అధ్యక్షుడు కూన గోపాలం తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం

కంచరపాలెం: కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడుదామనే పిలుపుతో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. కంచరపాలెం కూడలి నుంచి జ్ఞానాపురం జీఎస్ఎన్ యూఆర్‌ఎం కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్ఞానాపురంలో జరిగిన బహిరంగ సభలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ఆరెస్సెస్, బీజేపీల పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్మికులు, ప్రజల హక్కుల పైనా దాడి తీవ్రమైందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆదివాసీలను అంతమొందించి అడవులను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి మావోయిస్టులపై చట్టవిరుద్ధంగా యుద్ధం చేస్తోందని, దానిని వెంటనే ఆపి శాంతి చర్చలు కేంద్ర ప్రభుత్వం జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఎం.సురేష్, కె.రవి, ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.



టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న వామనమూర్తి

స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'కొమ్ము'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోక్ ఓవెన్స్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ కొమ్ము ప్రసాదరావు నియమితులయ్యారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ కొమ్ము నియామకాన్ని ప్రకటించారు. ఇంత వరకు ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన కొమ్ము ప్రసాద్ సేవలను గుర్తించి పెద్ద బాధ్యతలు అప్పగిస్తున్నామని రాజశేఖర్ తెలిపారు. యూనియన్ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


సింహాచలం డిపో ఇన్‌చార్జి డీఎంగా శరత్‌బాబు



శరత్‌బాబును అభినందిస్తున్న రాజశేఖర్, ఉద్యోగులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎంగా ఎస్.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజశేఖర్‌కు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా(జోన్–1) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబుకు రాజశేఖర్ పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందనలు తెలిపారు. ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉక్కు కార్మికులకు 'కూటమి' ద్రోహం



ప్రసంగిస్తున్న సీహెచ్ నర్సింగరావు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు టీడీపీ, జనసేన, బీజేపీ ద్రోహం చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్‌లో మూడు వేల మంది కార్మికులను తొలగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈనెల 20న నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఇక్కడ కూడా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రానికి అన్యాయం: చంద్రబాబు, నితీష్ కుమార్ మద్దతుతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. అయినా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చంద్రబాబు దృష్టిసారించడం లేదని ఆరోపించారు. కార్మికుల ఐక్య పోరాటాల కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోగలుగుతున్నామన్నారు. నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, కె.కిరీటం పాల్గొన్నారు.